# సంసార కాలక్షేపం

టేబుల్‌మీద భోజనానికి అన్నీ సర్దేశి విశాలభర్తని కేకేసింది.

'ఒక్క పది నిముషాలు' అని సమాధానం వెంటనే వచ్చింది.

"సరే - మీ ఇష్టం. నేనూ ఒక పది నిమిషాలు నడుం వాలుస్తా" అంటూ దీవాను మీద ఒరిగింది విశాల.

పది నిముషాలకు బదులు పావుగంట గడిచింది. రఘురాం నెమ్మదిగా వచ్చి టేబుల్ దగ్గర కూర్చున్నాడు.

"నీకో సంగతి చెప్పాలి" అన్నాడు.

ప్రశ్నార్థకంగా చూసిందామె.

కొంతసేపు మాటలేం సాగకుండా గడిచింది. కూర బాగుందనీ, చారు వేడి చేస్తే బాగుండేదని లాంటి మాటలయ్యాక.

"నేనొక కొత్త పద్ధతి ఆలోచించా" అన్నాడు.

"దేని గురించీ?"

"చెప్తా! మన రోషిణీకి పెళ్ళి చెయ్యాలనీ, సంబంధాలు చూడమనీ నువ్వంటూనే ఉన్నావు కదా"

"నేననడమేమిటి? మీకు లేదా".

"ఉంది. అందుకే ఓ కొత్త పద్ధతి చెప్తా. వినీవినకుండానే గయ్యి మనకు" అన్నాడు.

"విషయం చెప్పండి. గయ్యిమనాలో లేదో ఆలోచిస్తా" అంది విశాల.

"మా ఆఫీసులో కొత్తగా చేరాడు ఒక ఇంజనీరు కుర్రాడు. మన వాళ్ళే. కుర్రాడు

మంచివాడి లాగే ఉన్నాడు. నెమ్మదస్తుడు. శాఖా భేదమైనా ఫరవాలేదనుకున్నాం కదా!"

"ఇదేనా కొత్త విషయం?" వ్యంగ్యంగా అంది.

"అతనికి పెద్దగా ఎవ్వరూ లేరు. ఒక్క తల్లి మాత్రమే ఉంది"

"అబ్బా! సమస్యంతా అత్తగారితోనే కదా, బాబూ"

"చిత్రంగా మాట్లాడకు. మన అమ్మాయికి ఇద్దరమూ లేమూ. రేపు మనతోనే సమస్య అంటే".

"ఉన్నాం... కానీ"

"కానీ గీని లేదు. నే చెప్పేది పూర్తిగా విను".

"ఏమిటీ! కొత్త పద్ధతా"

"ఈ మధ్య పెళ్ళిల్లు ఇలా అవుతున్నాయి. అలా గొడవలొస్తున్నాయి. అబ్బాయీ, అమ్మాయీ అభిప్రాయాలూ, అభిరుచులూ కలవలేదంటున్నారు. పెద్దవాళ్ళు ముష్టి యుద్ధానికి దిగుతున్నారు".

"సరే, ఇంతకీ అసలు సంగతేంటీ".

రఘురాం గొంతు సవరించుకున్నాడు. మాటలు కూడదీసుకుంటున్నట్లు ఒక్క క్షణం ఆగి.

"మనింటికి ఆ అబ్బాయిని ఫ్రెండ్లీగా పిలుస్తాను. కాస్త స్నేహంగా అమ్మాయితో నాలుగు రోజులు కలిసిమెలిసి ఉండి, ఒకరి భావాలు, అభిరుచులు, అభిప్రాయాలు తెలుసుకున్నాక, పెళ్ళి ప్రస్తావన తెద్దాం" అన్నాడు.

"ఇంకా నయం. భలే కొత్త ఐడియా. సిగ్గులేకపోతే సరి. ఇదేమైనా అమెరికా అనుకున్నారా!"

"ఇందులో తప్పేం లేదు. మన పిల్లా మనకి తెలుసు. ఆ కుర్రాడు చదువుకున్న వాడు. పెద్దమనిషి".

విశాల కాసేపు నిశ్శబ్దంగా ఊరుకుంది. "సర్లేండి. ఇది నయమే గానీ, నలుగురూ ఏమనుకుంటారో".

"ప్రతిదానికీ సంశయం ఉండకూడదు. మనిష్టం మనిది. మన సమస్య నలుగురూ వచ్చి తీరుస్తారా?"

విశాల ఆలోచనలో పడింది. అమ్మాయి ఎవర్నో చూసుకుని ఇదిగో అంటే కులం గోత్రం అంటూ గింజుకోవాలి. ఇదేదో మన దృష్టిలోనే ఉంటుంది.

"సరేలెండి! అన్నీ కావాలంటే కుదిరేట్టు లేదుగా" అంది.

"అంత నిరాశ పడిపోవాల్సిందేమీ లేదు"

• • •

తండ్రి విషయం చెప్పగానే సగం అర్థమైంది రోషిణికి.

పెళ్ళికాని కుర్రాడు మన ఇంటికి ఎందుకొస్తాడు – ఊరికే... వాళ్ళమ్మ ఊర్లోలేదట. ఆహా! తను చంటి పిల్లననుకుంటున్నాడు. ఆమె లోపల్లోపలే నవ్వుకుంది. మనసులో ఆలోచించుకుంది. తనంత తనే లైఫ్‌పార్ట్‌నర్‌ని ఎంపిక చేసుకోలేకపోతోంది. ఆ చొరవ తనకి లేదు. మగవాళ్లు కనిపిస్తే స్నేహంగా నవ్వడం, పలకరిస్తే మాట్లాడటం తనకెలాగో ఉంటుంది. ఇప్పుడిప్పుడే అనిపిస్తోంది. తనూ మారాలని. అయితే రోషిణీకి బోలెడన్ని అభిప్రాయాలున్నాయి. మెండుగా ఆత్మాభిమానం ఉంది. తను చాలా తెలివైనదనీ, తన అభిప్రాయాలూ, అభిరుచులూ చాలా అపురూపమైనవనీ గట్టిగా నమ్ముతుంది. ఆ మేరకు కాస్తంత గర్వంగానే ఉంటుంది. ఆ కుర్రాడేదో ఇంటికొస్తాడంటే ఉత్సాహంగానే ఉంది. తన భావాలేం దాచుకుని, నటించకూడదని గట్టిగా నిర్ణయించుకుంది. వీలుంటే ఒకాట ఆడించాలనే చిలిపి కోరిక కూడా కలిగిందామెకు. తను ముడుచుకు పోకుండా ఫ్రీగా ఉండాలని ఒకటికి పదిసార్లు అనుకుంది రోషినీ.

• • •

అతను వస్తూనే నమస్కారమన్నాడు, అంటూనే అరసెకనులో ఆమెని చూసి ఫరవాలేదు, అందమైన పిల్లే అనుకున్నాడు.

రోషిణి నవ్వుతూ 'రండి, ప్లీజ్' అంటూ ఆహ్వానించింది. ఆ విధంగా పిలుస్తూనే 'అరే! పిల్లాడు బాగున్నాడే' అనుకుంది.

అతను డ్రాయింగ్ రూంలోకి వచ్చి కూర్చున్నాడు. చుట్టూ చూశాడు. అందంగా సర్ది ఉంది. అన్నీ శుభ్రంగా తళతళలాడుతున్నాయి. గోడల మీద పెయింటింగ్స్ కళాత్మకంగా ఉన్నాయి.

ట్రేలో మంచినీళ్ళ గ్లాసు తెచ్చి టీపాయ్ మీద పెట్టి తనూ సోఫా మీద కూర్చుంది. సాధారణ పరిచయాలు చేసుకున్నారు. సులువుగానే మాటల్లో పడ్డారు. కాస్సేపు ట్రాఫిక్ గురించి, షాపింగ్ మాల్స్ గురించీ, ఒకటి కొంటే మూడు ఉచితాల గురించీ నవ్వుకుంటూ, జోక్స్ వేసుకుంటూ మాట్లాడుకున్నారు. ఇద్దరికీ మరీ ఇబ్బందిగా మరీ బిడియంగా లేదు. అయితే ఇద్దరి మనసుల్లోనూ, ఒక దాగుడు మూత సాగుతోంది.

"మీకు సినిమాలంటే ఇష్టమేనా" అన్నాడతను చనువుగా.

ఆమె నవ్వింది. "భలే ప్రశ్న. సినిమాలంటే ఇష్టం లేని వారెవరైనా ఉంటారా? కాకపోతే ఎలాంటి సినిమాలిష్టం అంటే కొంత బావుంటుంది" అంది.

"పోనీ అదే చెప్పండి. ప్రశ్నా మీదే జవాబూ మీదే".

"ఇప్పుడొచ్చే తెలుగు సినిమాలంటే మాత్రం పరమ చిరాకు".

"మరైతే హిందీ సినిమాలంటే ఇష్టమా" చటుక్కున వంగి అన్నాడు.

"అన్నీకాదు. గానీ... కొన్ని" అంది.

"ఎలాంటివి?"

"మంచివి"

"అంటే అర్థం"

"మంచివి అంటే మంచివి. బాగుండేవి. నాకు నచ్చేవి".

"మీకు నచ్చినంత మాత్రాన అది మంచి సినిమా అవుతుందా?"

"తప్పకుండా అవుతుంది నాకు"

"ఈ మధ్య మన తెలుగులో కూడా కొన్ని గొప్ప సినిమాలొచ్చాయి"

"ఆహా! అలాగా? ఏదీ ఒకటి, రెండు చెప్పండి" వ్యంగ్యం ధ్వనించింది ఆమె కంఠంలో.

"బొమ్మరిల్లు, హ్యాపీడేస్, ఆ నలుగురూ – ఇలాంటివి".

"చాలు చాలు హిట్టయినయి నిజమే. అంతమాత్రాన అవి మంచి సినిమాలు, గొప్ప సినిమాలు అవుతాయా. మిమ్మల్నేమనాలి?"

"నన్నేం అనకండి. అవి నిజంగా మంచి సినిమాలని ఎవర్నడిగినా చెప్తారు"

"ఎవర్నో అడగడం ఎందుకూ, మనకి తెలియకపోతే కదా?"

"అంటే"

"ఏమిటండీ కుమార్‌గారూ, ఆడపిల్ల స్వతంత్రంగా ఉండి స్వేచ్ఛాభావాలు కలదై ఉందని చెప్పడానికి అర్ధరాత్రీ వెళ్ళి ఐస్‌క్రీం తినడం అని చెప్పే స్థితిలో డైరెక్టర్ ఉంటే ఏమనుకోవాలి?" తీసిపారేసినట్టు చెప్పింది.

"మరెలా చెప్పాలి"

"ఆవిధంగా మాత్రం కాదు. మరో సినిమాలో ఇంజనీరింగ్ చదివే కుర్రాళ్ళందరూ ఆడపిల్ల కనిపిస్తే చాలు చొంగలు కారుస్తూ చ్చాలా బావున్నావు. చ్చాలా బావున్నావ్ అనడం కంటే వేరేం ఉండదా. అందరూ అదే మాదిరిగా ఉంటారా? ఇంజనీరింగ్ చదువంటే ఆడపిల్లల వెంట పడటం, ప్రేమించడమేనా. మరో యాంగిలే లేదు. నాకైతే బోరు కొట్టింది"

"మరింతగా ఎందుకాడిందంటారు?"

"ర్యాగింగ్ అనేది స్టూడెంట్స్‌ని ఆకర్షించింది. అదీకాక ప్రేక్షకుల స్థాయి చాలా పడిపోయిందనడానికి మీరు చెప్పిన సినిమాలు ఉదాహరణలు".

"మీరు మరీ వయసు మళ్ళిన ముసలి వాళ్ళలా మాట్లాడుతున్నారు".

"మీరు మనసు ఎదగని వారిలా మాట్లాడుతున్నారనుకోవచ్చా" అంది తేలికగా చురకవేస్తూ. అతని ముఖం ఎర్రగా అయిపోయింది.

"నో... మీది వితండవాదం. అంతమందికి నచ్చిన సినిమాలో ఏం లేదంటే నేనొప్పుకోను".

"ఏం. అంతమంది చూస్తే అందులో గొప్ప విషయం ఉండాలని రూలేమన్నా

ఉందా?"

"ఉంది".

"ఉంటే ఉండనివ్వండి. నాకనవసరం. మునపటికి తెల్ల మేకనందరూ నల్ల మేకా అన్నార్ట. అలాగే ఉంది".

"సినిమా వాదించడానికి కాదు. చూసి ఆనందించడానికి".

"నిజమే. అర్థవంతంగా ఉంటే ఆనందం కలుగుతుంది".

"నేనొప్పుకోను" అతని ముఖంలో కళ తప్పింది.

"నాకేం నష్టం లేదు." ఆమె కనుబొమ్మలు ముడిచి పెదాలు వంకరగా తిప్పింది.

సరిగ్గా అప్పుడే కూరలు బుట్టతో లోపలికొచ్చాడు రఘురాం. అతనికంతా కాకపోయినా కొంత అర్థమైంది. "మంచి హాట్ డిష్కషన్‌లో ఉన్నట్టున్నారే" అన్నాడు.

చాలా సేపట్నించీ వీరి వాదాలు వింటూనే విశాలకీ, రఘురాంకి అర్థమైపోయింది. ఇది ఒట్టిప్రయాసేనని జరిగేదేమీ ఉండదనీ.

"నేనొస్తానండి" అన్నారు అరుణ్‌కుమార్.

"బలేవారే! ఉండండి, కాఫీ తెస్తాను" అంటూ ఆమె లోపలకెళ్ళింది.

"ఇందాక తాగాం కద. మళ్ళీనా!" అన్నాడు.

"ఫర్వాలేదు!" పది నిముషాల్లో నాలుగు కప్పులతో వచ్చింది రోషినీ. అతనో కప్పు తీసుకున్నాడు.

"కాఫీ బావుందా?"

"బాగానే ఉంది కానీ, మరి కాస్త షుగరు పడితే బ్రహ్మాండం" అన్నాడతను.

"కాఫీ తియ్యగా పానకంలా ఉంటే ఏం బావుంటుంది! కాఫీ అంటే చేదుగా ఉంటేనే కాఫీ" అంది రోషిణి.

"ఇందాకా మీ అమ్మగారు కలిపినట్టున్నారు" అన్నాడు ఉడికిస్తూ.

ఈ లోపల విశాల చెంచాతో పంచదార తెచ్చి అతని కప్పులో కలిపింది.

"చాలా బావుంది. మీరు రావటం కుమార్" అన్నాడు రఘురాం.

"నాకూ బావుంది" అన్నాడు నవ్వుతూ.

"మళ్ళీ ఎప్పుడొస్తారు?" అంది రోషిణి చటుక్కున.

"మీకభ్యంతరం లేకపోతే, కొత్త జేమ్స్‌బాండ్ సినిమాకి వెళ్దాం, రేపు. క్వాంటం ఆఫ్ సొలేష్. నలుగురం వెళ్దాం" అన్నాడు.

అతను నలుగురూ అనడంలో మర్యాద పెద్దవాళ్ళకి ఎంతో నచ్చింది.

"నాకేం అభ్యంతరం లేదు" అంది స్టైల్‌గా.

అతనటు వెళ్ళగానే ఏదో అనబోయి ఆగిపోయింది విశాల భర్త సైగ చూసి.

"మనం మూడు రోజుల టైం పెట్టుకున్నాం కదా! తొందర పడితే ఎలా!"

"రేపొస్తానన్నాడు కదా. రానీ"

ఇంగ్లీష్ సినిమాలు చూసే అలవాటు లేదని విశాల ఆగిపోయింది.

మరేదో అర్జంట్ పని ఉందని రఘురాం వెళ్ళలేదు. చివరికి ఇద్దరే వెళ్ళా రాత్రి వాదించుకుంటూ కొట్టుకున్నారుమోననేంత సీరియస్‌గా వచ్చారు.

రఘురాం, విశాల ఏమీ అర్థంకాక అయోమయంలో పడ్డారు. తను అనవసర ప్రయోగాలు చెయ్యడంలో అభాసుపాలవ్వడం ఖాయమని నిర్ణయించుకున్నాడు రఘు అందుకే మన సాంప్రదాయ ప్రకారం పోవడమే మంచిదని విశాలి సన్నాయి నొక నొక్కింది. పెళ్ళి చూపులకి రమ్మంటే వచ్చి లడ్డూ కారబ్బూంది తిని కాఫీ తాగి తెలియజేస్తాం అనేవారు. ఇష్టముంటే చేసుకుంటారు. లేకపోతే లేదు. ఏదో ఒకటయ్యే మహా అయితే రెండు వందల ఖర్చు అయ్యేది. ఈ గొడవ తప్పేది.

మూడో రోజు సాయంత్రం రోషిణి చక్కగా డ్రస్సప్ అయి –

"అమ్మా! మేం అలా నెక్లెస్ రోడ్డు వైపు వెళ్తున్నాం" అంటూ తల్లి జవాబు కో ఎదురు చూడకుండా వెళ్ళిపోయింది. విశాలకేమీ అర్థం కాలేదు. ఈ రోజుతో ఈ బాగో పూర్తవుతుంది. కానీ, ఆడపిల్ల ఈవిధంగా ఈ కుర్రాడితో అక్కడక్కడా కనిపిస్తే వ సంబంధం చూడటమెలాగ అని బెంగ పెట్టేసుకుందామె.

రాత్రి పదిన్నరకి ఇంటికొచ్చారు. అతను జాగ్రత్తగా ఆమెని ఇంటి దగ్గర ది "వస్తానండీ" అని చెప్పిమరీ వెళ్ళాడు.

రోషిణి లోపలికొస్తూ రుసురుసలాడింది. "ఏం మనిషో, బాబూ! అవున ప్రతిదీ కాదనే. పాప్‌కార్న్ తిందామంటే మొక్కజొన్న కండె అంటాడు. కాఫీ తాగుదామ కూల్ డ్రింకంటాడు. ప్రతి దానికీ వ్యతిరేకిస్తూంటే ఒళ్ళు మండింది. నేనేం తక తిన్నానా! అతను బెంచి మీద కూర్చుందామంటే నేను లాన్ మీదే అని పట్టుబట్టా అతను ఐస్‌క్రీం తింటే నేను పల్లీలు తిన్నా. ఇన్ని తిన్నాం. పొట్టనిండుగా ఉంది. డిన్ వద్దూ అంటే వినడే. గట్టిగా మాట్లాడుతూ చకచకా కాళ్ళూ చేతులు ముఖం కడుక నైటీలోకి మారిపోయింది రోషిణి.

"అమ్మా కాఫీ ఉంటే కావాలే. పాలున్నాయా" అంటున్న కూతుర్ని మౌనం చూసి కాఫీ కలిపి ఇచ్చింది విశాల.

మర్నాడు ఉదయం "నాన్నా! అరుణ్‌కుమార్‌తో మీరు మాట్లాడితే మాట్లాడం నాకు ఓకే" అంది రోషిణి. ఇంక తల్లితండ్రీ ఊరుకోలేక పోయారు "చాల్లే చా చూశాం మూడు రోజులూ భాగోతం. ఒకటే వాదన. ఒకటే విసుర్లూ. ఒక విషయంలోనై అతనన్న మాటని నువ్వు సరేనన్నావా?" అంది విశాల.

"అసలు బొత్తిగా మొహమాటానికైనా ఒకసారి సరేననలేదే! ఏ మొహం పెట్టుకు అడుగుతాం!" అంటూ తండ్రి చిర్రురుబుర్రులాడాడు.

"మీ ముఖం పెట్టుకునే అడగండి అడగాలనుకుంటే. నాకేం అంత ముఖం చెల్లని విషయం ఏమీ లేదు" అంది నిర్లక్ష్యంగా.

"అవునూ, నాకు తెలీక అడుగుతున్నా. ఒకరి అభిప్రాయాలూ, అభిరుచులూ తెలుసుకోవాలనే కదా అతన్ని పిలిచారు. అలా కాకపోతే లడ్డూ కారబ్బూందీ పెళ్ళి చూపులు పెట్టాల్సింది గొడవ లేకుండా" అంది. తల్లీ తండ్రీ మారు మాట్లాడకుండా ఊరుకున్నారు.

ఆఫీసులో అడుగుపెట్టగానే నువ్వు ముఖంతో రఘురాంని విష్ చేసిన అరుణ్ కుమార్‌ని చూడగానే కాస్త ఊరట కలిగింది. అయినా అసలు విషయం అడగడానికి ఎంతో సేపు సాహసించలేకపోయాడు. చివరికి సాహసించి.

"మిస్టర్ అరుణ్‌కుమార్! మిమ్మల్ని ఒకటి అడగాలనుకుంటున్నా" అన్నాడు.

అతను నవ్వుతూ "మీరేం అడగాలనుకుంటున్నారో నాకు తెలుసు. నాకు ఓకే. రోషిణి సరేనంటే ఆదివారం మా అమ్మని తీసుకుని మీ ఇంటికి వస్తా" అన్నాడు.

"రోషిణి ఎప్పుడో ఓకే" అంటూ అరిచాడు రఘురాం.

"మరింకేం? సన్ డే – మీ ఇంటికి అమ్మతో" అంటూ విజయోత్సాహ చిహ్నం చూపిస్తూ వెళ్ళిపోయాడు.

అతని వైపే ఆశ్చర్యంగా చూస్తూ.

'ఏ కాలంలోనైనా భార్యాభర్తలంటే తూర్పుపడమరలుగా ఉండాలని రాసి పెట్టి ఉంటుందేమో' అనుకున్నాడు.

ఇంటికెళ్ళగానే విశాలతో చెప్పాడు. అవాక్కయి ఆలోచనలో పడింది. అప్పుడామెకి తోచింది.

నిజం చెప్పాలంటే ఆయన చెప్పింది నేనెప్పుడు సరేనన్నాను. నేను అడిగింది ఆయన ఎప్పుడు అవునన్నారు? పెద్దవాదన తర్వాత ఎవరో ఒకళ్ళం నోరు మూసుకునే వాళ్ళం. వీళ్ళిద్దరూ ముందే ఒకరి గురించి ఒకరు తెలుసుకున్నారు. ఇంక వారిద్దరికీ సంసార కాలక్షేపానికి అంతే లేదు. ఆయుధాల్లేని యుద్ధమే అంతానూ.

(మే 2009 'నది' మాసపత్రిక)